
# 12 శతక పద్యాలు



**నేపథ్యం:** శతకం అంటే నూరు. నూరు లేదా అంతకన్నా ఎక్కువ సంఖ్యలోని పద్యాలు గలది శతకం. ఈ పద్యాల చివర మకుటం ఉంటుంది. ఉదా: విశ్వదాభిరామ వినురవేమ, శతకాలు ముఖ్యంగా నీతి, భక్తి, జ్ఞానం మొదలగు విషయాలను బోధిస్తాయి.





అనగ ననగ రాగ మతి శయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ.

అల్పుడెపుడు పల్కు నాడంబరము గాను
సజ్జనుండు బల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ!




మిరెపు గింజ చూడ మీద నల్లగ నుండు
కొరికి చూడ నోరు చురుకు మనును
సజ్జనులగు వారి సారమిట్లుండురా
విశ్వదాభిరామ వినురవేమ.

అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచెముండుటెల్ల గొదువ కాదు
కొండ యద్దమందు గొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినురవేమ.




పెద్దల మాట చద్ది మూట

## కొత్త పదాలు నేర్చుకుందాం.

1. అనగ నగన రాగము = పాడగాపాడగా రాగము;
అతిశయిల్లుచునుండు = వృద్ధిపొందుచు నుండును; తినగ తినగ = తరచుగా తినుచుండిన; వేము = వేప చిగురు;
తియ్యగ నుండు = మధురముగా వుండును,
సాధనమున = అభ్యాసము చేయుట వలన;
సమకూరు = లభించును;
ధరలోన = భూమి మీద.
<u>భావం:</u> పాటను సాధన చేయగా చేయగా మధురముగా మారును. తినగా తినగా వేప కూడా తియ్యగా ఉండును.
ఏపని అయినా సాధన చేయుటవలన సమకూరును.

2. అల్పుడు = సామాన్యుడు;
సజ్జనుడు = మంచివాడు;
కనకము = బంగారము
<u>భావం:</u> సామాన్యుడు ఎప్పుడూ ఆడంబరంగా గొప్పలు చెబుతాడు. సజ్జనుడు మాత్రం చక్కగా హాయిని కలిగించేటట్లుగా మాట్లాడుతూ ఉంటాడు. కంచు మోగినంత పెద్దగా బంగారం మోగదు కదా.

3. చూడ = చూచుటకు;
చురుకు మనును = భగ్గుమని మంట పుట్టును;
సారము = గొప్పదనము.
<u>భావం:</u> మిరియపుగింజ పైకి నల్లగా కనిపించినను కొరికినచో మంట పుట్టించును. అట్లే సజ్జనులు కఠినముగా మాట్లాడినను ఇతరులకు దానివల్ల మేలే కలుగును.

4. అనువుకానిచోట = తగని చోటున;
అధికులము = ఘనులము;
కొదువ కాదు = తక్కువ కాదు.
<u>భావం:</u> ప్రతికూలముగా ఉన్నచోటున నేను గొప్పవాడినని గొప్పలు పలుకరాదు. దాని వలన అవమానము, అపనిందలు కలుగును. ఒదిగి ఉండుటే మంచిది. దాని వలన గొప్పదనము తగ్గదు. కొండ కూడా అద్దములో కొంచెంగా కనిపిస్తుంది కదా !

## I. వినండి-చెప్పండి.

1 మీకు తెలిసిన సుమతీ శతక పద్యాలను రెండింటిని తెలిపి, భావాన్ని చెప్పండి.
2. నీవు కష్టపడి సాధించిన ఏదేని ఒక మంచి కార్యాన్ని గురించి తెలియజేయి.

## II. సంభాషించండి.

1. ఆరు రుచులు ఏవి ? ఆయా రుచులను కలిగిన పండ్ల పేర్లను తెలపండి.
2. సచ్చరిత్ర కలిగిన కొందరి పేర్లను తెలపండి. వారు ఇతరులకు చేసిన సాయాన్ని గురించి వివరించండి.

## III. చదవండి-చెప్పండి-రాయండి.

### అ. సరియైన సమాధానాన్ని గుర్తించి రాయండి.

1. అనగ నగన అతిశయిల్లేది.
(అ) రాగం (ఆ) ధనం
(ఇ) ప్రాణం (ఈ) దుఃఖం
2. సజ్జనుడు ఇలా పలుకుతాడు.
(అ) వాడిగా (ఆ) చల్లగా
(ఇ) ఆడంబరంగా (ఈ) గర్వంగా

3. కొండ చిన్నదిగా కనిపించేది ....

(అ) నీటిలో (ఆ) నీడలో

(ఇ) అద్దంలో (ఈ) చిత్రంలో

**ఆ. ఒక్క వాక్యంలో సమాధానం రాయండి.**

1. భూమిపై పనులు ఏవిధంగా సాధించవచ్చును ?
2. అల్పుడు ఎలా పలుకుతాడు ?
3. మిరియపుగింజ ఏవిధంగా నుండును ?
4. ఎచ్చట అధికుల మనరాదు ?

**ఇ. మూడు, నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. ప్రయత్నము చేత పనులను సాధింపగలమని ఎట్లు చెప్పగలవు ?
2. సజ్జనుల గుణ మెట్టిది ?
3. అణగి మణగి వుండుట అవసరమని కవి ఎట్లు తెలిపెను ?

**ఈ. ఖాళీలు పూరించండి.**

1. తినగ తినగ ———— తియ్యనుండు.
2. కంచు మ్రోగునట్లు ———— మ్రోగునా.
3. ———— వారి సారమిట్లుండురా !
4. కొంచెముండుటెల్ల ———— కాదు.

## IV. భాషావగాహన

**అ. సొంత వాక్యాల్లో ఉపయోగించండి.**

1. సమకూరు  2) చురుకుమను
3) సారము  4) ఆడంబరము

**ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

1. తినగ తినగ వేము తియ్య నుండు.
2. మిరెపుగింజ చూడ మీద నల్లగా నుండు.
3. కొండ యద్దమందు గొంచెమై యుండదా?

**ఇ. అనులేఖనం చేయండి.**

1. అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు.
2. కొండ అద్దమందు కొంచెమై యుండదా ?

## V. సృజనాత్మకత.

**శతకములను రచించిన వారి పేర్లను వారు రాసిన ఒక్కొక్క పద్యమును సేకరించి దాని భావమును మీ సొంతవాక్యాల్లో రాయండి.**

| కవి | పద్యము | భావము |
|---|---|---|
| | | |
| | | |

ఉ.సూ : అపరిచిత పదాలను, వాక్యాలను ఉక్తలేఖనం చేయించండి.